సొంతింటి కల నెరవేరేనా?

- నిరాశ పరిచిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకం
- రేకుల షెడ్డులు, గుడిసెల్లోనే కాలం గడుపుతున్న పేదలు
- మండలంలో ఇళ్లు లేనివారు 70వేలకు పైమాటే..
- ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూపు
- కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించాలని పేదల వేడుకోలు

మునిపల్లి(అందోల్): ఏళ్లు గడుస్తున్నా పేదలు ఉండేందుకు కనీసం గూడు కరువయ్యింది. గత పదేళ్ల పాటు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లను కొంతమందికే ఇచ్చి మిగతావారి ఆశలపై నీళ్లు చల్లింది. దీంతో తలదాచుకునేందుకు గూడు లేకపోవడంతో ఎంతోమంది గుడిసెల్లోనే జీవనం గడుపుతూ కాలమెల్లదీస్తున్న పరిస్థితి నెలకొంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా దయతలచి ఇళ్లను కేటాయించి పుణ్యం కట్టుకోవాలని మండల పరిధిలోని ఆయా గ్రామాల పేదలు వేడుకుంటున్నారు.


రేకులతో కప్పి ఉన్న గుడిసె

ఇందిరమ్మ ఇళ్లపైనే ఆశలు..

మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని నిరుపేదలకు నేటికీ సరిగా ఇళ్లు లేవు. గత బీఆర్ఎస్ పాలనలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం ఎన్నో ఆశలతో ఎదురుచూసిన ప్రజలకు నిరాశే మిగిలింది. ప్రభుత్వాలు మారినా తమకు నేటికీ ఉండేందుకు కనీసం ఇల్లు లేకపోవడంతో తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలని నిరుపేదలు వాపోతున్నారు.

ఇళ్లు లేనివారు 70వేలకు పైనే..

అధికారుల అంచనా ప్రకారం మండలంలోని ఆయా గ్రామాల్లో ఇళ్లు లేని పేదలు 70వేలకు పైనే ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇండ్లు లేనివారిలో ప్రధానంగా దళితులు, బీసీలు, కుర్మ, గొల్లలతో పాటు బడుగు, బలహీన వర్గాల పేదలే ఎక్కువగా ఉన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇండ్లు లేని పేదలందరికి డబల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పడంతో ఎదురుచూపులు మాత్రమే మిగిలాయి తప్ప ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయిందని లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుత ప్రభుత్వమైనా స్పందించాలని విన్నపం

పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎంతోమంది ఇళ్లులేని నిరుపేదలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైనవారందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని చెప్పడంతో పేదలు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తే తమ ఖాళీ స్థలాల్లోనైనా ఇళ్లు నిర్మించుకుంటామని భావిస్తున్నారు. చేసిన కష్టం తినడానికే సరిపోతోందని, అటువంటి పరిస్థితుల్లో సొంతంగా ఇల్లు ఎలా నిర్మించుకుంటామని వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైన ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మండల పరిధిలోని ఆయా గ్రామాల పేదలు కోరుతున్నారు.

32 ఏళ్లుగా గుడిసెలోనే ఉంటున్నాం



మాకు ఇప్పటికీ ఉండడానికి ఇల్లు లేదు. చిన్నపాటి గుడిసెలోనే జీవనం సాగిస్తున్నాం. దీంతో రాత్రి వేళల్లో విషసర్పాలు వస్తుండటంతో భయంభయంగా బతుకుతున్నాం. చిన్నపాటి వర్షమొచ్చినా గుడిసెంత వర్షం నీళ్లతో నిండిపోతోంది. 32 ఏళ్ల క్రితం కల్లపల్లి బేల్లూర్ గ్రామం నుంచి తాటిపల్లి గ్రామానికి బతుకుదెరువు కోసం వచ్చాం. నాటి నుంచి ఓట్లు వేస్తూనే ఉన్నాం. కానీ ఇప్పటివరకు ఇల్లు మంజూరు కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైన స్పందించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతున్నాం.

– బేగరి స్వరూప, తాటిపల్లి గ్రామం

అర్హులైనవారిని గుర్తిస్తాం



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రజా పాలన కార్యక్రమం ద్వారా ఆరు గ్యారంటీల హామీలో భాగంగా లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం. సంబంధిత ఉన్నతాధికారుల నుంచి అదేశాలు రాగానే మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో అర్హులైనవారిని గుర్తించి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తాం. ఇళ్ల కేటాయింపులో పారదర్శకంగా వ్యవహరిస్తాం.

– తెన్‌మొళి, తహసీల్దార్, మునిపల్లి

క్లుప్తంగా

పేదలకు దుప్పట్లు పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న వివేకానంద సేవా సమితి సభ్యులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని వడ్డి గ్రామంలో మంగళవారం వివేకానంద సేవా సమితి అధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రస్తుతం చలి తీవ్రత అధికంగా ఉన్నందునా పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వారి సౌకర్యార్థం దుప్పట్లు పంపిణీ చేసినట్లు వివేకానంద సేవా సమితి నాయకులు ఆనందేశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో ఉమేష్, శ్రీకాంత్, సాయిరాం, సచిన్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ మ్యూజియం సందర్శన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

నారాయణఖేడ్: ఖేడ్‌లోని మైనార్టీ బాలుర గురుకులం విద్యార్థులు మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సైన్స్ మ్యూజియాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జీవశాస్త్రానికి సంబంధించి పలురకాల జీవక్రియ వ్యవస్థలకు సంబంధించిన పరికరాలను ఉపాధ్యాయుడు లక్ష్మణ్ ప్రయోగాత్మకంగా చూపుతూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గురుకుల ప్రధానోపాధ్యాయులు ఎంఏ ఖాదర్, సమన్వయకర్త తారాసింగ్, సైన్స్ ఉపాధ్యాయులు రాములు, రమేశ్‌రెడ్డి, అఫ్రాసుల్తానా, జాకీర్, జ్యోతి, అక్బర్, అనిత, నాహ్రీద్ ఉన్నిసా, అజీజ్ పాల్గొన్నారు.

శబరిమలకు తరలిన అయ్యప్ప స్వాములు


శబరిమలకు వెళ్తున్న అయ్యప్ప స్వాములు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని గడ్డపోతారం గ్రామం నుంచి మంగళవారం భారీసంఖ్యలో అయ్యప్ప స్వాములు శబరిమలకు తరలివెళ్లారు. శబరిమల అయ్యప్ప సేవా సమాజం జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్ ఆధ్వర్యంలో స్వాములు ఇరుముడులను ధరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 30మంది అయ్యప్ప స్వాములు శబరిమలకు తరలివెళ్లారు.

కొనసాగుతున్న క్రీడాపోటీలు


రన్నింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పస్తాపూర్ డాక్టర్ ఆర్ఎల్ఆర్ స్కూల్‌లో నిర్వహిస్తున్న ఆటల పోటీలు కొనసాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం రన్నింగ్, ఖోఖో, స్కిప్పింగ్, కబడ్డీ, లెమన్ స్పూన్, తాడు లాగడం, లాంగ్‌జంప్, బస్తాల్లో కాళ్లుపెట్టి పరిగెత్తడం తదితర పోటీలను నిర్వహించారు. క్రీడాపోటీలు ముగిసిన తరువాత విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తామని ప్రిన్సిపాల్ కవిత తెలిపారు. క్రీడల నిర్వహణను పీఈటీలు నరేష్, నవీన్, మహేష్ పర్యవేక్షించారు.

పరామర్శ

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని భూత్కూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త పెద్దగొల్ల వీరయ్య(60) గుండెపోటుతో సోమవారం సాయంత్రం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ మంగళవారం గ్రామానికి చేరుకొని మృతుడికి నివాళ్లు అర్పించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ డైరెక్టర్ మధు, నాయకులు సంగమేశ్వర్ ఉన్నారు.

యువతి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: యువతి అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడకు చెందిన ఓ యువతి(24) ఈ నెల 8వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కూతురి అదృశ్యంపై మంగళవారం తండ్రి చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పారదర్శకంగా పనులు చేపడుతాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

- సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు చెల్లిస్తాం
- అభివృద్ధికి అందరూ సహకరించాలి
- ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): నియోజకవర్గంలో పారదర్శకంగా అభివృద్ధి పనులు చేపడుతామని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. ఎంపీపీ గుర్రపు సుశీల అధ్యక్షతన మండల పరిషత్తు సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు చేపడతామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమంపై శాఖల వారీగా సమీక్షలు నిర్వహిస్తామన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని, లేనిపక్షంలో సదరు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా కాంట్రాక్టర్ల పేర్లను బ్లాక్ లిస్టులో నమోదు చేయాలని అధికారులను సూచించారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన పెండింగ్‌లో ఉన్న బిల్లులు సర్పంచ్‌లకు ఇప్పిస్తామని హామీనిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే సంజీవరెడ్డిని ఎంపీపీ, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. సమావేశంలో జెడ్పీటీసీ నర్సింహారెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ బాలశంకర్, కోఆప్షన్ సభ్యులు అలీ, ఎం ఘని, వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీపీ మల్లేశం, నాయకులు కిషన్‌నాయక్, బుర్గుల పోచయ్య, నర్సింహారెడ్డి, భాస్కర్‌సేట్, వీర్‌షెట్టి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరిగా పాటించాలని కార్పొరేటర్ పుష్ప అన్నారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ 13వ బ్లాక్‌లలో రూ.30లక్షలతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరితగతిన పనులు పూర్తిచేస్తామని తెలిపారు. సీసీ రోడ్డు మంజూరు అయిందని త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, మహిపాల్‌రెడ్డి, చాకలి నర్సింహా, మహేందర్‌రెడ్డి, హన్మంతు, మల్లేష్, అనిల్, ఖాజా పాల్గొన్నారు.


శ్రీనివాస్‌నగర్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ పుష్ప

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి


మాట్లాడుతున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని బొల్లారం మున్సిపల్ వైస్‌చైర్మన్ అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని అంబేడ్కర్ కాలనీలో ఉన్న ఏలిము రాక్ ప్రార్థనా మందిరం రెండో వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వివరించారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్‌రెడ్డి, రవికుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

వట్‌పల్లి(అందోల్): అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జోగిపేట ఏఎస్ఐ అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లాకు చెందిన వెంకన్న తన సోదరుడికి చెందిన వ్యవసాయ భూములను కొన్నేళ్లుగా సాగుచేసుకుంటూ కుటుంబంతో కలిసి అందోలు శివారులోని వ్యవసాయ క్షేత్రం వద్ద నివసిస్తున్నాడు. ఈ నెల 7వ తేదీన పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సంగారెడ్డి ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఏజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం వెంకన్న మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

గీతం విశ్వవిద్యాలయం సందర్శన

పటాన్‌చెరు టౌన్: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని సంగారెడ్డిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గీతం కోర్ ఇంజనీరింగ్ విభాగాల అధ్యాపకుల సహకారంతో విశ్వవిద్యాలయంలో ఉన్న అత్యాధునిక సౌకర్యాలను ప్రత్యక్షంగా చూపే లక్ష్యంగా ఈ సందర్శన సాగింది. 130 మంది ఈఈఈ, ఈసీఈ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వ్యక్తిగత, వృత్తిపర అభివృద్ధికి వర్తించే విభిన్న అంశాల్లో నైపుణ్యాలు, జ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు అనుభవజ్ఞులైన అధ్యాపకులు, పరిశ్రమ నిపుణుల నేతృత్వంలో విద్యార్థులకు వివిధ ఉపాధి అవకాశాలపై సంపూర్ణ అవగాహన కల్పించారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

నారాయణఖేడ్: ఖేడ్ శివారులోని పెద్దశంకరంపేట జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశాల కోసం విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు రూ.100 చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 11న విద్యార్థులకు ప్రవేశపరీక్షను నిర్వహించనున్నట్లు తెలిపారు.

క్రీడాస్ఫూర్తిని కొనసాగించాలి

నారాయణఖేడ్: క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని కొనసాగించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలే భాస్కర్‌రాజ్ అన్నారు. నారాయణఖేడ్ తహసీల్ గ్రౌండ్‌లో మంగళవారం మోడీ క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 మోడీ క్రికెట్ టోర్నీని నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జన్‌వాడే సంగప్ప, నాయకులు, యువకులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో గొడవ - ఒకరికి గాయాలు

పటాన్‌చెరు టౌన్: మద్యం మత్తులో స్నేహితులు గొడవ పడిన ఘటనలో ఒకరికి తీవ్ర గాయమైన సంఘటన బీడీఎల్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బిహార్‌కు చెందిన సోనుకుమార్ బతుకుదెరువు కోసం పటాన్‌చెరు మండలం పాశమైలారం వచ్చాడు. పారిశ్రామికవాడలో ఓ కంపెనీలో రోజువారి కూలీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం పనిచేసే చోట మధ్యప్రదేశ్‌కు చెందిన నవీన్ కుమార్‌తో పరిచయం ఏర్పడింది. సోమవారం వారిద్దరు కూలి డబ్బులు తీసుకునేందుకు పరిశ్రమ వద్దకు వెళ్లారు. అనంతరం సోను కుమార్ ఇంట్లో మద్యం సేవించేందుకు వెళ్లారు. అక్కడ కుల ప్రస్తావన వచ్చి గొడవ పడ్డారు. సోను కుమార్ రాడ్‌తో నవీన్ కుమార్ తల పై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన నవీన్‌ను ఆస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడిన సోను కుమార్‌పై మంగళవారం బీడీఎల్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆధునిక వసతులతో పూర్తిస్థాయి ఫర్నిచర్‌తో గ్లాండ్ ఫార్మా పరిశ్రమ సౌజన్యంతో రూ.4,50 కోట్లతో ఘనపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలను తీర్చిదిద్దిన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని మంగళవారం గ్లాండ్ ఫార్మా పరిశ్రమ సీఎస్ఆర్ హెడ్ రఘురామన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. పాఠశాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించిన గ్లాండ్ ఫార్మా పరిశ్రమ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కావ్యకాశిరెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు బాసిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పంచాయతీరాజ్ డీఈ సురేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దశరథరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష

రాబోయే గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పటాన్‌చెరు పట్టణంలోని మైత్రి మైదానంలో నిర్వహించనున్న సాంస్కృతిక కార్యక్రమాలు, జెండా ఆవిష్కరణ, తదితర అంశాలపై ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి వివిధ శాఖల అధికారులతో కలిసి క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో అమీన్పూర్ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ భాస్కర్, మండల విద్యాధికారి రాథోడ్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

స్టడీ టూర్ ప్రారంభం


పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టడీ టూర్‌ను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ మాట్లాడుతూ పర్యటనలో భాగంగా కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరులోని ప్రముఖ మార్కెట్లను సందర్శించి అధ్యయనం చేయనున్నట్లు వివరించారు.

పేదలకు వరం.. సీఎంఆర్ఎఫ్

పటాన్‌చెరు టౌన్: పేదలకు వరం.. సీఎంఆర్ఎఫ్ అని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాసనగర్ కాలనీకి చెందిన సరిత, గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన రాజ్యలక్ష్మికి వైద్య చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన 2,50 లక్షల విలువైన చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, సీనియర్ నాయకులు దశరథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయండి

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కొండాపూర్(సంగారెడ్డి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అందుకు ప్రభుత్వానికి తమ పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తెలిపారు. కొండాపూర్‌లోని రైతువేదికలో మంగళవారం పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చెప్పిన విధంగా పేదింటి బిడ్డల వివాహాలకు రూ.లక్ష నగదుతో పాటు తులం బంగారం అందజేయాలన్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఎలాంటి వివక్షత లేకుండా అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించాలని తెలిపారు. అనంతరం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నిర్మలాజగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే రెండు గ్యారంటీలను అమలు చేసిందని, మిగతా నాలుగు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మనోజ్‌రెడ్డి, జెడ్పీటీసీ పద్మావతి, తహసీల్దార్ అనిత, ఎంపీడీఓ మధులత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విఠల్, ఎంపీటీసీలు విజయభాస్కర్‌రెడ్డి, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.


కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షురాలు

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ స్వప్న

న్యాల్‌కల్(జహీరాబాద్): గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని జెడ్పీటీసీ స్వప్నభాస్కర్ అన్నారు. మండల పరిధిలోని అల్లాదుర్గం–మెట్‌కుంట రోడ్డు నుంచి తాట్‌పల్లి గ్రామానికి వెళ్లే పార్మెషన్ రోడ్డు పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారిందని, మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరగా వెంటనే నిధులు మంజూరు చేయించానని తెలిపారు. చాలా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేయించినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, టేకూర్, మిర్జాపూర్(ఎన్) సర్పంచ్‌లు అమీర్, మల్‌రెడ్డి, సంతోష్ పటేల్, అశోక్ పటేల్, శివకుమార్‌స్వామి, నవీన్ పటేల్, సిద్దయ్య స్వామి, వైజ్యనాథ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పటాన్‌చెరు టౌన్: చిట్కుల్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఆయా కాలనీలలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు సర్పంచ్ నీలం మధు ముదిరాజ్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలిపారు. బాధ్యతగా పనిచేస్తూ గ్రామంలో అనేక అభివృద్ధి పనులను చేపట్టి ఆదర్శంగా నిలిచామన్నారు. మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యతనిస్తున్నామని వివరించారు. గ్రామస్తుల సహాయ, సహకారాలతో జాతీయస్థాయిలో ఆదర్శ గ్రామంగా నిలబెట్టామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డుసభ్యులు, నాయకులు, కాలనీవాసులు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ నీలం మధు ముదిరాజ్

ప్రైవేట్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించండి


ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల బస్సు డ్రైవర్ల యూనియన్ సభ్యులు

సదాశివపేట(సంగారెడ్డి): ప్రైవేట్ స్కూల్స్, కళాశాలల బస్సు డ్రైవర్ల సమస్యలను యజమాన్యాలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సీఐటీయూ పట్టణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల డ్రైవర్లు, సహాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సు డ్రైవర్లలందరికీ యజమాన్యాలు ఈఎస్ఐ, పీఎఫ్ గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాల పోషణ భారమైందని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బస్సు డ్రైవర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాస్, ఎండి మైబలి, శ్రీనివాస్, నర్సింహులుగౌడ్, జగన్, రాజు, శ్రీనివాస్, మహేందర్, పాపయ్య, భాస్కర్, శేఖర్, అశోక్, కుమార్ పాల్గొన్నారు.